జయహో ఇస్రో

- శాస్త్రవేత్తల కృషికి పలువురు ఫిదా
- ప్రత్యక్ష ప్రసారాలు చూసి ఆనందించిన విద్యార్థులు
- చరిత్ర సృష్టించారన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్‌–3ని విజయవంతంగా ల్యాండ్ చేసినందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తల బృందానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రయోగం ద్వారా ప్రతి భారతీయుడు గర్వపడేలా భారత శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారన్నారు. చంద్రయాన్‌–3 విజయవంతంగా ప్రయోగించి చంద్రుడిపై ఉన్న ఆసక్తికర అంశాలను మానవాళికి అందించడంలో ముందడుగు వేశారన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు. చంద్రుడుపై నివాస యోగ్యత, నీటి లభ్యత, జీవరాసుల మనుగడకు సంబంధించిన సమాచారం ప్రపంచానికి చేరవేయడంలో భారతదేశం ముందుంటుందనే దానికి నిదర్శనంగా నిల్చారన్నారు. ఎన్నో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మారిన భారత శాస్త్రవేత్తలకు, శాస్త్రవేత్తలను ప్రోత్సహించిన భారత ప్రభుత్వానికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక, భౌగోళిక, చంద్రమండల, అంతరిక్ష రంగాల్లో భారత్ గణనీయమైన అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. దేశంలోని 140 కోట్ల భారతీయుల కలను సాకారం చేసిన భారత శాస్త్రవేత్తలకు మరొక్కసారి శుభాభినందనలు తెలిపారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: మండలం కేంద్రమైన యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చంద్రయాన్ –3 ఉపగ్రహం చంద్రునిపై ల్యాండ్ అయ్యే దృశ్యాలను ప్రత్యేక ల్యాబ్‌ట్యాబ్‌లో విద్యార్థులకు ఉపాధ్యాయులు బుధవారం సాయంత్రం చూపించారు. చంద్రయాన్‌–3 చంద్రునికి చేరువయ్యే కొద్ది విద్యార్థుల్లో ఎంతో టెన్షన్ పెరిగింది. ఈ సమయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శాస్త్రవేత్తలు ఎంతో పరిజ్ఞానంతో చేస్తున్న ఈ ప్రయోగం విజయవంతమై ప్రపంచ దేశాల్లో భారతదేశం నాలుగో స్థానానికి కైవసం చేసుకోవాలని ప్రార్థనలు చేశారు. చంద్రునిపై విజయవంతంగా చంద్రయాన్‌–3 అడుగు పెట్టడంతో అంతా ఉద్వేగంతో వందేమాతరం, జైహింద్ అంటూ నినాదాలు చేసి తమ దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయభారతి, హైస్కూల్ ఉపాధ్యాయులు, ప్లస్ టూ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: చంద్రయాన్‌–3 ల్యాండింగ్ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలు మేరకు మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు చంద్రయాన్‌–3 లైవ్‌షో కార్యక్రమాన్ని బుధవారం తిలకించారు. చంద్రయాన్‌–3 ల్యాండింగ్ విజయవంతంలో శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, రూపకల్పన చేసిన ఇంజినీర్లు, ఇస్రో సిబ్బందికి పేరుపేరునా ప్రపంచ దేశాల్లో భారతదేశం కీర్తి ప్రతిష్టలు అగ్రస్థానంలో ఉంచటం పట్ల ప్రజలు ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.



చంద్రయాన్‌–3 లైవ్‌షో తిలకిస్తున్న శావల్యాపురం హైస్కూలు విద్యార్థులు



ప్రయోగం విజయవంతం కావడంతో సంబరాల్లో చిలకలూరిపేట విద్యార్థులు



జాతీయ పతాకాలు ప్రదర్శిస్తున్న చిలకలూరిపేట రోటరీ క్లబ్ సభ్యులు

శాస్త్రవేత్తలకు సెల్యూట్

చిలకలూరిపేట: చంద్రయాన్‌–3 విజయవంతమైన సందర్భంగా విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహ విద్యార్థులు బుధవారం భారత శాస్త్రవేత్తలకు సెల్యూట్ కార్యక్రమం నిర్వహించారు. వసతి గృహం నుంచి జాతీయ పతాకాలు చేతపట్టి జయహో భారత్, భారత శాస్త్రవేత్తలకు సెల్యూట్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె రాజాబాబు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో ఆనందం వ్యక్తం చేస్తున్న వసతి గృహ విద్యార్థులు

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు చంద్రయాన్ – 3 ప్రయోగాన్ని టీవీల్లో తిలకించారు. ప్రత్యక్ష కార్యక్రమం ద్వారా ఎప్పటికప్పుడు చంద్రయాన్ కదలికలను గమనిస్తూ చంద్రయాన్‌పై టీవీల్లో వస్తున్న వ్యాఖ్యానాలను, సమాచారాన్ని ఆసక్తిగా విన్నారు. గ్రామాల్లో యువత, ఆసక్తి ఉన్న పలువురు పెద్దలు కూడా లైవ్ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. చంద్రయాన్‌–3 చంద్రునిపై ల్యాండ్ అవటంతో కేరింతలు కొట్టారు. చంద్రయాన్ ప్రయోగంలో పాల్గొన్న శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. వాట్సాప్ గ్రూపులలో చంద్రయాన్ విజయోత్సవ శుభాకాంక్షలు తెలియపరుచుకున్నారు. మరికొందరు చందమామపై ఆశు కవిత్వాలు కూడా చదివారు. చంద్రయాన్ విజయోత్సవాన్ని ఆస్వాదిస్తూ సామాన్యుడు వ్రాసి పాడిన పాటను అందరూ ఆస్వాదించారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: చంద్రయాన్‌–3 విజయవంతమై విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై విజయవంతంగా దిగటాన్ని విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి ఆనందంతో కేరింతలు కొట్టారు. విద్యాశాఖ ప్రత్యేక ఆదేశాలతో పట్టణంలోని పాఠశాలల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతరిక్ష పరిశోధనలు, విజ్ఞాన శాస్త్రాలపై విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించే దిశగా ఈచర్యలు చేపట్టారు. పట్టణంలోని ప్రభుత్వ వసతిగృహాలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యక్ష ప్రసార వీక్షణ ఏర్పాట్లు చేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: ఏఎంజీ విద్యాసంస్థల్లోని విద్యార్థుల కోసం సంస్థ ప్రాంగణంలో బుధవారం చంద్రయాన్ –3 ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమం మొత్తం ఆసక్తిగా వీక్షించిన విద్యార్థులు చంద్రయాన్‌–3 లాండింగ్ విజయవంతం కావడంతో జాతీయ పతాకాలు చేతబట్టి సంబరాలు చేసుకున్నారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వీట్ల పంపిణీ

రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా దిగడంపై హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో మిఠాయిలు పంచి జాతీయ పతాకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాపు వెంకట్రావు, కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, పట్టణ ఎస్ఐ లోకేష్, తోటకూర వెంకట నారాయణ, తాళ్ల అంజిరెడ్డి, గల్లా సాంబశివ రావు,తొట్టెంపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





చంద్రయాన్ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తున్న రొంపిచర్ల, సంతగుడిపాడు హైస్కూల్ విద్యార్థులు



చంద్రునిపై విక్రమ్ ల్యాండింగ్‌ను వీక్షిస్తున్న సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థులు



జెడ్పీహైస్కూల్లో చంద్రయాన్‌-3 ల్యాండిన్ దృశ్యాన్ని తిలకిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వినుకొండ(నూజెండ్ల): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని నాలుగు టన్నుల ఇసుకను సీజ్ చేయడం జరిగిందని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయబాస్కర్‌రావు తెలిపారు. ఎస్ఈబీ పల్నాడు జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని నాగులవరం గ్రామం వద్ద ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని 4 టన్నుల ఇసుకను సీజ్ చేయడం జరిగిందని ఎస్ ఈబీ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్ రావు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ జి. హరిబాబును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

25న ఉపాధి హామీ ప్రజావేదిక

ఈపూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఈ నెల 25న 15వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రంగనాయకులు బుధవారం తెలిపారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై ఈ నెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందాలు ఆడిట్ చేసి గ్రామసభలు నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే ప్రజావేదికలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

ఆలయ పునర్ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిని కూకుట్ల జగదీష్‌కుమార్, రంజిత దంపతులు రూ.58,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో బుధవారం ఈఓ టి.సుధాకరరెడ్డికి విరాళం మొత్తాన్ని అందించారు. త్వరలో ప్రారంభం కానున్న ఆలయ రాతికట్టడానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ కోరారు. ఆలయానికి అందించే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు.

నరసరావుపేటలో భారీ వర్షం



నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో బుధవారం సాయంత్రం సుమారు గంటకు పైగా జోరుగా వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సుమారు 20.మి.మీ మేర వర్షం పడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. 22 రోజుల్లో నరసరావుపేటలో 26.2 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే నమోదైంది. నెలవారీ సాధారణ వర్షం 139.2 మి.మీ. పడాల్సి ఉంది.

బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం



చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్నా నారాయణ చెప్పారు. బుధవారం చిలకలూరిపేటకు విచ్చేసిన ఆయన పాటిమీద అంకమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు. గతంలో బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసేవారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పరిపాలనలో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని వెల్లడించారు. బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సంబంధిత వర్గాల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. మంత్రి వర్గంలో సైతం బీసీలకే అగ్రస్థానం కల్పించారని తెలిపారు. ఇలాంటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి బీసీలు అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందని కోరారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు జక్కా రాంబాబు, నాయకులు మారుబోయిన నాగరాజు, వెంకట్రావు, శివయ్య, శ్రీను, నాగబాబు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం



చిలకలూరిపేట: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మైనార్టీలన్నా, మైనార్టీ సంక్షేమం అన్నా ముందుగా గుర్తుకు వచ్చేది మహానేత డాక్టర్ వైఎస్సార్ అని చెప్పారు. ముస్లింల కష్టాలు గుర్తెరిగి నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత ఆయనదేనన్నారు. తండ్రి ఆశయాలను పుణికిపుచ్చుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల అభ్యున్నతే ధ్యేయంగా అనేక పథకాల్లో ముస్లింలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. పేద మైనార్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం ద్వారా ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. అమ్మఒడి పథకం కింద ముస్లిం చిన్నారుల తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేలు జమ చేస్తున్నారని వెల్లడించారు. ముస్లిం అక్క చెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత ద్వారా 45 ఏళ్ల పైబడిన వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్నారని, షాదితోఫా కింద ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున అందజేస్తున్నారని తెలిపారు. పథకాలతో పాటు పాలనలోనూ సముచిత స్థానం కల్పిస్తున్నారని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలను చట్టసభలకు పంపారని చెప్పారు. దీంతో పాటు ఇద్దరు మేయర్లు, 11 మంది మున్సిపల్ చైర్‌పర్సన్లుగా అవకాశం కల్పించారని చెప్పారు. మసీదులలో సేవలు అందించే ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజన్లకు రూ. 5 వేలు చొప్పున గౌరవ వేతనాలను చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఇంత మేలు చేస్తున్న ప్రభుత్వానికి మైనార్టీలు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ముస్లిం సమాజానికి తెలియజేసేందుకు అందరూ సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ బాజి, సయ్యద్ హుజాఫా, షేక్ బాషా, షేక్ సలీం, సయ్యద్ బషీర్‌మేస్త్రి, వేటపాలెం సుభాని, ఉమరవలి, సయ్యద్‌బడే, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలు బాధాకరం

శావల్యాపురం: మణిపూర్ రాష్ట్రంలో దళిత గిరిజన మహిళపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు హేయమైన చర్య అని రాష్ట్ర మాలమహానాడు వర్కింగ్ అధ్యక్షులు గోదా జాన్‌పాల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని చినకంచర్ల గ్రామం ఎస్సీ కాలనీలో జరుగుతున్న ప్రవేటు కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రు విజయ్, నియోజకవర్గ అధ్యక్షులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి విప్పర్ల విజేందర్‌రావు, మండల యూత్ అధ్యక్షులు మాలపోలు దాసు,పిట్టల గోవిందు, గోవిందరాజులు, భాగ్యరాజు, సమేలు పాల్గొన్నారు.

చెప్పిన మాట, ఇచ్చిన హామీ నెరవేర్చాం

- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గణపవరంలో గడప గడపకు మన ప్రభుత్వం

నాదెండ్ల: ఎన్నికల సమయంలో చెప్పిన ప్రతి మాట, ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి అభివృద్ధి, సంక్షేమాన్ని దరిచేర్చి సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు తమ కుటుంబ సభ్యుడిగా ఆదరిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని గణపవరంలో బుధవారం తొలిరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ దేవత సీతాలాంబతల్లి (బొడ్డురాయి), పోలేరమ్మ తల్లి, నూతనంగా నిర్మించిన కోదండ రామాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలౌతున్న తీరును ప్రజలతో మమేకమై తెలుసుకున్నారు. గడప గడపకు వెళ్లి ప్రజలను కలిసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి అమలు చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో పింఛను రావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి ఉసూరుమన్న ఎందరో బాధితులకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో తలుపు తట్టి వలంటీర్ల ద్వారా పింఛను అందిస్తూ ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ఆండగా నిలిచిందన్నారు. మూడేళ్ల పాలనలో 5 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి యువతకు వెన్నుదన్నుగా నిలిచామన్నారు.

అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, అందరికీ ఇళ్లు, ఆరోగ్య శ్రీ, చేతివృత్తులకు చేయూత వంటి విశిష్ట పథకాలతో ప్రతి గడపకు ప్రభుత్వ సాయం చేరుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిట్లో తెచ్చామన్నారు. గతంలో ప్రభు త్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, వలంటీర్ల వ్యవస్థతో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు దరిచేరుతున్నాయన్నారు. దీంతో ప్రజలకు ఎంతో ఉపయుక్తకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గణపవరం సొసైటీ మాజీ చైర్మన్ కాట్రు రమేష్, కౌన్సిలర్లు షేక్ ఆదంవలి, తులం సుధాకర్, పిల్లి సాగర్, నాయకులు కాటా వెంకటేశ్వర్లు, గాలి బుచ్చయ్య, మండలనేని సుబ్బారావు, కొండెపాటి నాగయ్య, జెడ్పీ స్కూల్ పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, మాజీ ఎంపీటీసీలు తాళ్ళూరి ప్రభుదాసు, మండలనేని వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు తలహాఖాన్, కాటా సూర్యనారాయ ణ, అవ్వారు సుబ్రహ్మణ్యం, షేక్ రహంతుల్లా, ఆముదాలపల్లి ఆంజనేయులు, అనిశెట్టి కోటేశ్వరరావు, కాట్రు భువన తదితరులు పాల్గొన్నారు.



గణపవరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి విడదల రజిని

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నరసరావుపేట టౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ. వెంకట నాగేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన బత్తుల జగన్‌మోహన్‌రావు వద్ద 2015వ సంవత్సరంలో చల్లా మురళీ కృష్ణ రూ.5 లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. బ్యాంకు ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో 23 జనవరి 2020 మొదటి అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ నిందితుడికి ఏడాది జైలు, ఫిర్యాదు దారుడికి రూ.5 లక్షల రూపాయల పరిహారం చెల్లించేలాగా తీర్పు చెప్పారు. తీర్పుపై నిందితుడు జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకోవటంతో దిగువ కోర్టు విధించిన శిక్షను యధావిధిగా ఖరారు చేశారు.

నేడు మండల సమావేశం


వినుకొండ(నూజెండ్ల): వినుకొండ ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహిస్తున్న ఎంపీడీవో మంగాపుర్‌నాథ్ తెలిపారు. ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో అన్ని శాఖలకు సంబంధించిన పనుల వివరాలు, అభివృద్ధిపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పాఠశాలలో అధికారుల తనిఖీలు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మండల పరిషత్ ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనాన్ని ఆయన తిని రుచి చూశారు. విద్యార్థులకు భోజనం వడ్డిస్తూ మెను విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కేపీ బాబురెడ్డి, బి. బ్రహ్మేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు సుభాని, ఈవోపీఆర్‌డీ విజయరాము పాల్గొన్నారు.

ఈపూరు జెడ్పీహెచ్ ఎస్ పరిశీలన

ఈపూరు: జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన ఈపూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు అందించాలని ఆమె సూచించా రు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీడీవో రంగనాయకులు, ఎంఈవో రామతులసి పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ప్రత్యేక అధికారి

చీకటిగలపాలెంలో...

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని చీకటీగలపాలెం మోడల్ స్కూల్, నడిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేకాధికారి శ్రీరాములు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి పంపిణీ చేస్తున్న బలవర్ధకమైన బియ్యం ప్రాముఖ్యతను వివరించారు. ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నడిగడ్డలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జియో డిజిటల్ ఫైబర్‌పై పోలీసులకు మున్సిపల్ అధికారుల ఫిర్యాదు

నరసరావుపేట: పల్నాడురోడ్డులోని కేబీఆర్ పార్కుకు ఎదురుగా భూమిలో ఉన్న మంచినీటి మెయిన్ పైపులైనును పగులకొట్టిన జియో డిజిటల్ ఫైబర్ ప్రతినిధులపై మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు రూరల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. రావిపాడు సమీపంలోని శాంతినగర్ రిజర్వాయర్ నుంచి పట్టణంలోని ప్రజలకు తాగునీరు అందించే ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటి సరఫరాచేసే ప్రధాన పైపులైనుకు ఫైబర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు అండర్ కేబుల్ వేస్తూ డ్యామేజ్ చేశారన్నారు. దీని వలన ఆ పైపును బాగుచేసేందుకు రెండురోజులపాటు పట్టణంలోని కొన్ని ప్రాంతాల ప్రజలకు మంచినీటి సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. దీనికి కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీసు అధికారులను కోరారు.

నేడు చేపల చెరువు వేలంపాట

బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంట గ్రామ పంచాయతీకి చెందిన గోనుగుంట్లవారి చెరువుకు నేడు వేలంపాట నిర్వహించనున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా బుధవారం తెలిపారు. 2023–25 వరకు రెండేళ్లపాటు చేపల పెంపకం చేపట్టవచ్చని, ఈ వేలంపాటలో పాల్గొనేవారు దరావతు రూ.10 వేలు చెల్లించాలని చెప్పారు. ఉదయం 11 గంటలకు సచివాలయంలో ఈ వేలంపాట ఉంటుందని తెలిపారు.